పీఎస్ఎల్వీ-సీ60 సక్సెస్

- నిర్ణీత కక్ష్యలోకి చేరిన రెండు ఉపగ్రహాలు
- స్పేడెక్స్ మొదటి దశ ప్రయోగం సఫలం
- వారం రోజుల్లో ఈ రెండింటి అనుసంధానం
- అరుదైన ఘనతకు అతి చేరువలో భారత్

శ్రీహరికోట, డిసెంబర్ 30: భారత అంతరిక్ష పరిశోధక సంస్థ(ఇస్రో) చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మక స్పేడెక్స్(స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్) ప్రయోగంలో మొదటి దశ విజయవంతమైంది. సోమవారం రాత్రి 10 గంటల 15 నిమిషాలకు శ్రీహరికోటలోని మొదటి లాంచ్‌ప్యాడ్ నుంచి పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్(పీఎస్ఎల్వీ)-సీ60 వాహకనౌక నింగిలోకి దూసుకెళ్లింది. ఎస్‌డీఎక్స్01(చేజర్), ఎస్‌డీఎక్స్02(టార్గెట్) అనే రెండు చిన్న ఉపగ్రహాలను ఈ వాహకనౌక నిర్ణీత భూదిగువ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ ఒక్కో ఉపగ్రహం 220 కిలోల బరువు ఉంది. ఐదు కిలోమీటర్ల దూరం ఉండేలా వీటిని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. తర్వాత ఇస్రో శాస్త్రవేత్తలు భూమికి 470 కిలోమీటర్ల ఎత్తులో ఈ రెండింటినీ 3 మీటర్ల సమీపానికి చేర్చి డాకింగ్ ప్రక్రియను పూర్తి చేస్తారు. ఈ ప్రయోగంలో భాగంగా ఇస్రో మరో 24 పేలోడ్‌లను సైతం అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటిల్లో 14 ఇస్రో, డీఓఎస్‌కు చెందినవి కాగా, 10 పేలోడ్లు ప్రభుత్వేతర సంస్థవి. కాగా, సోమవారం రాత్రి 9.58 గంటలకు ప్రయోగం ప్రారంభించాల్సి ఉన్నా అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్ కారణంగా ప్రయోగం రెండు నిమిషాలు ఆలస్యమై 10 గంటల 15 సెకన్లకు ప్రారంభమైంది. ఇస్రోకు ఇది 99వ ప్రయోగం. పీఎస్ఎల్వీ-సీ60



ప్రయోగం విజయవంతమైందని ఇస్రో చీఫ్ సోమనాథ్ ప్రకటించారు. ఉపగ్రహాలను వాహకనౌక నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని తెలిపారు. డాకింగ్ ప్రక్రియకు మరో వారం రోజులు పడుతుందని చెప్పారు. ఇస్రో శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు.

భవిష్యత్ ప్రయోగాలకు కీలకం

ఇస్రో చేపట్టబోతున్న భవిష్యత్ ప్రయోగాలకు డాకింగ్ సామర్థ్యం అత్యంత కీలకం. చంద్రుడి పైకి వ్యోమగాములను పంపడానికి, చంద్రుడి ఉపరితలం నుంచి మట్టి నమూనాలను భూమి పైకి తీసుకురావడానికి డాకింగ్ సామర్థ్యం అవసరం. భారత్ లక్ష్యంగా పెట్టుకున్న భారతీయ అంతరిక్ష కేంద్రం(బీఏఎస్) ఏర్పాటుకు, అంతరిక్షానికి భారత్ నుంచి మొదటి వ్యోమగామిని పంపించడానికి చేపట్టనున్న గగన్‌యాన్ ప్రయోగానికి సైతం డాకింగ్ అవసరం. స్పేడెక్స్ ప్రయోగం విజయవంతమైతే అంతరిక్ష ప్రయోగాల్లో డాకింగ్ సామర్థ్యం ఉన్న నాలుగో దేశంగా భారత్ నిలుస్తుంది. ఇప్పటివరకు అమెరికా, రష్యా, చైనాకు మాత్రమే ఈ సామర్థ్యం ఉంది.

ఏమిటీ స్పేడెక్స్ ప్రయోగం?

అంతరిక్ష ప్రయోగాల్లో డాకింగ్, అన్‌డాకింగ్ సామర్థ్యాన్ని పరీక్షించడం ఈ స్పేడెక్స్ ఉద్దేశం. అంతరిక్షంలో వేరుగా ఉన్న రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేయడాన్ని డాకింగ్ అంటారు. ఇలా డాకింగ్ చేసినప్పుడు రెండింటి మధ్య విద్యుత్తు లేదా ఇంధనాన్ని బదిలీ చేయడానికి, వ్యోమగాములు ఒక దాంట్లో నుంచి ఇంకో దాంట్లోకి వెళ్లడానికి అవకాశం ఉంటుంది. డాకింగ్ ప్రక్రియ ద్వారా రోబోటిక్ ప్రయోగాల్లో ఉపగ్రహాల సర్వీసింగ్‌కు, ఇంధనాన్ని నింపడానికి, ఉపగ్రహ జీవితకాలాన్ని పెంచడానికి అవకాశం ఉంటుంది. ఉపగ్రహాలను వేరు చేయడాన్ని అన్‌డాకింగ్ అంటారు.

అఫ్గాన్‌లో కిటికీలపై నిషేధం

తాలిబన్ ప్రభుత్వం ఆదేశాలు

కాబూల్: అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం బాలికలు, మహిళల రక్షణ కోసం ఇండ్లలో కిటికీలపై నిషేధం విధించింది. కొత్తగా నిర్మించే ఇండ్లకు కిటికీలను ఏర్పాటు చేయరాదని ఆదేశించింది. ఇప్పటికే ఉన్న ఇండ్లలోని కిటికీలను మూసివేసేలా యజమానులను ప్రోత్సహించాలని అధికారులకు చెప్పింది. మహిళలు సంచరించే వంట గది, పెరడు, బావి, ఇతర ప్రదేశాలు పొరుగింట్లో నుంచి కనిపించకుండా జాగ్రత్త వహించాలని తెలిపింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. విదేశీ ఎన్జీవోల్లో మహిళల నియామకాలను నిషేధించినట్లు అఫ్గానిస్థాన్ ఆర్థిక మంత్రి ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించే సంస్థల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

'ఇచ్చట కాళ్లు పట్టుకోవడం నిషిద్ధం'

కార్యాలయంలో బోర్డు పెట్టిన కేంద్రమంత్రి

భోపాల్: తన ఆఫీసులో కేంద్ర సామాజిక, సాధికారత శాఖమంత్రి వీరేంద్ర కుమార్ పెట్టిన బోర్డులు ఆసక్తికరంగా మారాయి. 'ఇచ్చట కాళ్లు పట్టుకోవడం నిషేధం' అంటూ మధ్యప్రదేశ్ టికమ్‌గఢ్‌లోని తన ఆఫీసులో వీరేంద్ర కుమార్ బోర్డులు ఏర్పాటు చేశారు. 'కాళ్లు మొక్కిన వారి పని జరగదు' అని సైతం ఆయన స్పష్టం చేస్తూ బోర్డులు పెట్టారు. రాజకీయాల్లో ఎక్కువగా కనిపించే కాళ్లు పట్టుకునే సంస్కృతికి భిన్నంగా వీరేంద్ర పెట్టిన ఈ బోర్డులు ఆయన ఆఫీసుకు వచ్చే సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. టికమ్‌గఢ్ నుంచి వరుసగా నాలుగుసార్లు వీరేంద్ర ఎంపీగా గెలిచారు.

దేశంలోనే ధనిక సీఎం చంద్రబాబు

- ఆంధ్రప్రదేశ్ సీఎం ఆస్తి రూ.931 కోట్లు
- మమతా బెనర్జీ ఆస్తి కేవలం 15 లక్షలు



న్యూఢిల్లీ, డిసెంబర్ 30: ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు దేశంలోనే ధనిక ముఖ్యమంత్రి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) పేర్కొన్నది. దేశంలోని ముఖ్యమంత్రుల ఆస్తుల వివరాలతో కూడిన నివేదికను సోమవారం ఏడీఆర్ విడుదల చేసింది. చంద్రబాబు నాయుడుకు అత్యధికంగా రూ.931 కోట్ల ఆస్తి ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొన్నది. 31 ముఖ్యమంత్రుల మొత్తం ఆస్తి కలిపి రూ.1,630 కోట్లు ఉంది. వీరందరి ఆస్తి కలిపితే సగటున రూ.52.59 కోట్లు ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొన్నది. సీఎంల సగటు ఆదాయం ఏడాదికి రూ.13,64,310. ఇది దేశ సగటు తలసరి ఆదాయం కంటే 7.3 రెట్లు అధికం. ముఖ్యమంత్రులు అందరిలో తక్కువ ఆస్తి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఉంది. ఆమెకు రూ.15 లక్షలు మాత్రమే.

ధనిక ముఖ్యమంత్రులు - వారి ఆస్తులు

చంద్రబాబు నాయుడు (ఆంధ్రప్రదేశ్)	రూ.931 కోట్లు
పెమా ఖండూ (అరుణాచల్ ప్రదేశ్)	రూ.332 కోట్లు
సిద్ధరామయ్య (కర్ణాటక)	రూ.51 కోట్లు

తక్కువ ఆస్తులున్న సీఎంలు - వారి ఆస్తులు

మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్)	రూ.15 లక్షలు
ఒమర్ అబ్దుల్లా (జమ్ము కశ్మీర్)	రూ.55 లక్షలు
పినరయి విజయన్ (కేరళ)	రూ.1.18 కోట్లు

క్రిమినల్ కేసుల్లో రేవంత్ నంబర్ 1

మొదటిపేజీ తరువాయి...

కేసులు ఉన్నట్టు ప్రకటించారు. ఇందులో 10 మందిపై హత్యాయత్నం, కిడ్నాప్, లంచం, నేరపూరిత బెదిరింపులు వంటి తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. నేరపూరిత బెదిరింపు(ఐపీసీ సెక్షన్-506), ఐపీసీ సెక్షన్-505(2), రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం(ఐపీసీ సెక్షన్-505), మోసం చేయడం, ఆస్తిని అప్పగించడానికి మోసపూరితంగా ప్రేరేపించడం(ఐపీసీ సెక్షన్-420), ఖాతాల తప్పుడు సమాచారం ఇవ్వడం(ఐపీసీ సెక్షన్-477ఏ), మతవిశ్వాసాన్ని అవమానించడం లేదా మతాన్ని రెచ్చగొట్టడం(సెక్షన్-295ఏ) వంటి ఆరోపణలతో రేవంత్ రెడ్డిపై కేసులు ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొన్నది. కాగా, రేవంత్ రెడ్డి తర్వాత 47 కేసులతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రెండోస్థానంలో ఉన్నారు.

రేపటికి ప్రపంచ జనాభా 809 కోట్లు!

- 2024లో 7.1 కోట్లు పెరిగిన ప్రపంచ జనాభా
- న్యూ ఇయర్ నాటికి అమెరికా జనాభా 34.1 కోట్లు
- అమెరికా సెన్సస్ బ్యూరో నివేదిక అంచనా

న్యూయార్క్, డిసెంబర్ 30: ఈ ఏడాదిలో(2024) ప్రపంచ జనాభా 7.1 కోట్లు పెరిగి కొత్త సంవత్సరం నాటికి 809 కోట్లకు చేరుకుంటుందని సోమవారం విడుదలైన అమెరికా జనాభా బ్యూరో నివేదిక అంచనా వేసింది. 2023తో పోలిస్తే 2024లో జనాభా పెరుగుదల స్వల్పంగా తగ్గి 0.9 శాతంగా నమోదైంది. 2025 జనవరిలో ప్రపంచ జనాభా 7.5 కోట్లు పెరుగుతుందని, ప్రతి సెకనుకు 4.2 జననాలు, 2.0 మరణాలు ప్రపంచవ్యాప్తంగా నమోదవుతాయని నివేదిక అంచనా వేసింది. 2024లో అమెరికా జనాభా 26 లక్షలు పెరుగింది. కొత్త సంవత్సరం నాటికి అమెరికా జనాభా 34.1 కోట్లకు చేరుతుందని సెన్సస్ బ్యూరో అంచనా వేసింది. 2025 జనవరిలో అమెరికాలో ప్రతి 9 సెకండ్లకు ఒక జననం, ప్రతి 9.4 సెకండ్లకు ఒక మరణం ఉంటుందని అంచనా. ప్రతి 23.2 సెకండ్లకు అమెరికా జనాభాకు ఒక అంతర్జాతీయ వలస జత అవుతుందని నివేదిక తెలిపింది. జననాలు, మరణాలు, అంతర్జాతీయ వలసలు అన్నీ కలిపి అమెరికా జనాభాలో ప్రతి 21.2 సెకండ్లకు ఒక వ్యక్తి పెరుగుదల ఉంటుందని పేర్కొన్నది. 2020 దశకంలో అమెరికా జనాభా దాదాపు 97 లక్షలు పెరిగింది. పెరుగుదల రేటు 2.9 శాతంగా ఉంది. 2010 దశకంలో అమెరికా జనాభా పెరుగుదల 7.4 శాతం ఉంది. 1930 దశకం తర్వాత ఇదే అత్యంత తక్కువ శాతం పెరుగుదల.

సౌర వ్యవస్థను దాటి వెళ్లే వ్యోమనౌక

- అభివృద్ధి చేస్తున్న ఎలాన్ మస్క్ 'స్పేస్‌ఎక్స్'
- మనుషులను ఇతర గ్రహాలకు తీసుకెళ్లడమే లక్ష్యం
- రెండేండ్లలో మార్స్ పైకి ప్రయాణం

న్యూయార్క్: సౌర వ్యవస్థను దాటి వెళ్లగలిగే సామర్థ్యంతో ఒక అధునాతన పునర్వినియోగ వ్యోమనౌకను ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ అభివృద్ధి చేస్తున్నది. 'స్టార్‌షిప్' పేరుతో రూపొందుతున్న ఈ వ్యోమనౌక 100 టన్నులకు పైగా బరువును మోసుకెళ్లగలదు. వేడి ఉష్ణోగ్రతలను తట్టుకునేలా దీనిని తయారుచేస్తున్నారు. సుదీర్ఘ అంతరిక్ష ప్రయోగాల కోసం ఇందులో అధునాతన ప్రొపల్షన్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. మన సౌర వ్యవస్థలోని అన్ని గ్రహాలతో పాటు సమీప నక్షత్ర వ్యవస్థల్లోకి సైతం ప్రయాణించే సామర్థ్యం స్టార్‌షిప్‌కు ఉండాలనేది మస్క్ ఆలోచన. సంప్రదాయ రాకెట్లలో పునర్వినియోగ సామర్థ్యం అరుదుగా ఉంటుంది. స్టార్‌షిప్‌లో ఈ సామర్థ్య ఏర్పాటుపై స్పేస్‌ఎక్స్ సంస్థ ప్రధానంగా దృష్టి పెట్టింది. తద్వారా అంతరిక్ష ప్రయాణ ఖర్చును గణనీయంగా తగ్గించాలని, సులభతరం చేయాలని ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే స్టార్‌షిప్ ప్రాథమిక పరీక్షలు పూర్తయ్యాయి. ఇవి విఫలమవడంతో స్పేస్‌ఎక్స్ సంస్థ స్టార్‌షిప్‌కు మార్పుచేర్పులు చేస్తున్నది.

మొదట అంగారకుడి పైకి

భూమిపై ఏదైనా విపత్తు సంభవించి మానవ మనుగడకు ప్రమాదం వాటిల్లితే ఇతర గ్రహాలకు మనుషులను తీసుకెళ్లేలా స్టార్‌షిప్ ఉండాలనేది మస్క్ ఆలోచన. ఇందులో భాగంగా మొదట అంగారకుడి పైకి రెండేండ్లలో స్టార్‌షిప్‌ను పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మనుషులతో నాలుగేండ్లలో మార్స్ పైకి స్టార్‌షిప్ చేరుకుంటుందని ఆదివారం ఎలాన్ మస్క్ ప్రకటించారు.

ఒక సిగరెట్‌తో 20 నిమిషాల ఆయుఃక్షీణత

లండన్, డిసెంబర్ 30: ఒక సిగరెట్ తాగితే సగటున 20 నిమిషాల ఆయుర్దాయం కోల్పోతారని తాజా అధ్యయనం హెచ్చరించింది. పురుషులైతే 17 నిమిషాలు, మహిళలైతే 22 నిమిషాల జీవిత కాలాన్ని కోల్పోతారని యూనివర్సిటీ కాలేజ్ లండన్ తాజా అధ్యయనం తెలిపింది. ఈ నేపథ్యంలో పొగతాగే వారు అనారోగ్యకరమైన ఈ అలవాటు వీడటం ద్వారా కొత్త ఏడాదికి శ్రీకారం చుట్టాలని పరిశోధకులు సూచించారు. గత అధ్యయనాల కన్నా తాజా అధ్యయనం ధూమపానం వల్ల నష్టపోయే జీవిత కాలం ఎక్కువని తేల్చడం గమనార్హం. సుమారుగా 20 సిగరెట్లున్న ఒక ప్యాకెట్‌ను ఒక రోజులో తాగి పడేస్తే సుమారుగా ఏడు గంటల జీవిత కాలం తగ్గుతుందని అధ్యయనం తెలిపింది. జీవిత కాలం పూర్తిగా మెరుగుపడాలని ఆశించే వారు ధూమపానాన్ని పూర్తిగా మానేయాలని అధ్యయనం సూచించింది. ధూమపానం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 80 లక్షల మంది మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.

హోం బ్యాటరీలుగా ఈవీలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: ఎలక్ట్రిక్ వాహనాలను గృహాలకు అవసరమయ్యే విద్యుత్తును నిల్వచేసే బ్యాటరీలుగా ఉపయోగించుకునేందుకు అవకాశాలు మెండుగా ఉన్నట్టు జర్మనీకి చెందిన ఫ్రాన్‌హోఫర్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో తేలింది. బైడైరెక్షనల్ చార్జింగ్ టెక్నాలజీని విస్తృత స్థాయిలో వినియోగించడం ద్వారా జర్మనీ, ఫ్రాన్స్ లాంటి యూరోపియన్ దేశాలకు భారీగా లబ్ధి చేకూరుతుందని ఆ అధ్యయనం పేర్కొన్నది. సోలార్ ప్యానళ్ల లాంటి మైక్రో జనరేషన్ టెక్నాలజీలను ఈ వ్యవస్థకు జోడిస్తే గృహ విద్యుత్తు అవసరాలకు అయ్యే ఖర్చులో చాలా డబ్బు ఆదా కావడంతోపాటు సంప్రదాయ విద్యుత్తు కేంద్రాలపైన, ముఖ్యంగా శిలాజ ఇంధనాలపైన ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని పరిశోధకులు చెప్తున్నారు. జర్మనీలో విద్యుత్తు వాహనాలను రోజుకు సగటున దాదాపు గంటసేపు మాత్రమే ఉపయోగిస్తున్నారని, ఈ అధ్యయనంలో తేలింది.

జిమ్మీ కార్టర్ కన్నుమూత

- వందేండ్లు జీవించిన అమెరికా మొదటి మాజీ అధ్యక్షుడు
- భారత్‌లో ఆయన పేరుపై గ్రామం



వాషింగ్టన్, డిసెంబర్ 30: అమెరికా మాజీ అధ్యక్షుడు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత జిమ్మీ కార్టర్(100) కన్నుమూశారు. జార్జియాలోని ప్లెయిన్స్‌లో ఉన్న తన స్వగృహంలో ఆయన తుది శ్వాస విడిచారు. 1977 నుంచి 1981 మధ్య డెమోక్రటిక్ పార్టీ తరపున కార్టర్ అమెరికాకు 39వ అధ్యక్షుడిగా పని చేశారు. తన పదవీకాలంలో ప్రపంచ శాంతి కోసం ఆయన కృషి చేశారు. 1979లో ఈజిప్ట్, ఇజ్రాయెల్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించారు. చైనాతో దౌత్యపరమైన సంబంధాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు అమెరికా విదేశాంగ విధానంలో మానవ హక్కులకు ప్రాధాన్యం కల్పించారు. 1980 ఎన్నికల్లో ఆయన ఓడిన తర్వాత పూర్తిస్థాయిలో ప్రపంచ శాంతికి కృషి చేశారు. దీంతో 2002లో ఆయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. జిమ్మీ కార్టర్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతాపం వ్యక్తం చేశారు.

భారత్‌తో ప్రత్యేక అనుబంధం

జిమ్మీ కార్టర్‌కు భారత్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 1977-78లో ఆయన భారత్‌లో పర్యటించి, పార్లమెంటులో ప్రసంగించారు. భారత్‌లో పర్యటించిన మూడో అమెరికా అధ్యక్షుడు కార్టర్. తన భార్య రోసలిన్ కార్టర్‌తో కలిసి హర్యానాలోని దౌలత్‌పూర్ నసీరాబాద్ అనే గ్రామాన్ని కార్టర్ సందర్శించారు. ఆ తర్వాత గ్రామస్థులు కార్టర్‌కు గౌరవసూచికగా తమ గ్రామానికి కార్టర్‌పురి అని పేరు పెట్టుకున్నారు. కార్టర్ తమ గ్రామానికి వచ్చిన జనవరి 3వ తేదీని సెలవు దినంగా ప్రకటించుకున్నారు.

సంతాప సమయంలో విహారాలా?

రాహుల్ తీరుపై బీజేపీ విసుర్లు

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు పూర్తయిన వెంటనే కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వియత్నాం పర్యటనకు వెళ్లడం పట్ల బీజేపీ విమర్శలు గుప్పించింది. బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ వ్యవహారశైలిని తప్పుబట్టారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ మృతికి దేశమంతా సంతాపం పాటిస్తున్న సమయంలో న్యూ ఇయర్ వేడుకలను జరుపుకునేందుకే రాహుల్ గాంధీ వియత్నాం బయల్దేరి వెళ్లారంటూ మాలవీయ ఆరోపించారు. ఈ సందర్భంగా బ్లూస్టార్ ఆపరేషన్‌ను

ప్రస్తావిస్తూ సిక్కులను గాంధీలు, కాంగ్రెస్ ద్వేషిస్తారని, దర్బార్ సాహిబ్(అమృత్‌సర్ స్వర్ణ దేవాలయం)ని ఇందిరా గాంధీ అపవిత్రం చేసిన విషయాన్ని మరచిపోరాదని పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాణిక్యం టాగూర్ స్పందిస్తూ అది రాహుల్ గాంధీ వ్యక్తిగత పర్యటన.. మీకేం బాధ అని ప్రశ్నించారు.

కేరళ ఓ మినీ పాకిస్థాన్

మహారాష్ట్ర మంత్రి రాణే వివాదాస్పద వ్యాఖ్యలు

ముంబై : కేరళపై మహారాష్ట్ర మంత్రి నితేష్ రాణే చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. కేరళ ఓ మినీ పాకిస్థాన్ అని, అందుకే కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలిచారని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులంతా వారికి ఓట్లు వేశారన్నారు. దీనిపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. మంత్రి పదవిలో కొనసాగే హక్కు రాణేకు ఉందా ప్రశ్నించింది.

సోమవారం అమృత్‌సర్‌లో గోల్డెన్ గేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

రైతుల బంద్‌తో స్తంభించిన పంజాబ్

- రైళ్లు, బస్సు సర్వీసుల రద్దు
- హర్యానాపై కూడా ప్రభావం
- కొన్ని చోట్ల ఉద్రిక్త పరిస్థితులు

చండీగఢ్: సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాల పిలుపు మేరకు సోమవారం పంజాబ్ బంద్ జరిగింది. అధికారులు 200కుపైగా రైళ్ల రాకపోకలను రద్దు చేశారు. పంజాబ్-ఢిల్లీ మధ్య 163 రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు చెప్పారు. రైల్వే స్టేషన్లలో సరైన సమాచారం ఇచ్చేవారు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సులు, ప్రయాణికుల రవాణా వాహనాల సేవలు కూడా రద్దయ్యాయి. దీంతో రాష్ట్రమంతా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదాలు జరిగాయి. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రైతు సంఘాల ప్రతినిధులు సోమవారం ఉదయం నుంచి పాటియాలా-చండీగఢ్ జాతీయ రహదారిపై టోల్ ప్లాజాల వద్ద ధర్నాకు దిగారు. పాటియాలా, జలంధర్, అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, బటిండా, పఠాన్‌కోట్‌లలోని రోడ్లు, జాతీయ రహదారులపై ధర్నాలు చేశారు. అమృత్‌సర్ గోల్డెన్ గేట్ వద్ద, బటిండాలోని రాంపూర్ ప్రవేశ మార్గం వద్ద రైతులు భారీగా నిరసన చేపట్టారు. బంద్ కారణంగా వాహనాలు రోడ్లపై పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. ఫిరోజ్‌పూర్, జలంధర్, లూధియానా, బటిండా రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు చిక్కుకున్నారు. హర్యానాలోని అంబాలా కంటోన్మెంట్ ప్రాంతం ప్రజలపై రైళ్లు, బస్సుల రద్దు ప్రభావం తీవ్రంగా పడింది. విమానాశ్రయాలు, దవాఖానలు, ఉద్యోగాల ఇంటర్వ్యూలకు వెళ్లేవారికి ఆటంకం కలిగించబోమని రైతులు చెప్పారు.

డల్లేవాల్‌కు వైద్య సాయంపై సుప్రీంకోర్టు విచారణ నేడు

ఆమరణ దీక్ష చేస్తూ అస్వస్థతకు గురైన రైతు సంఘం నేత డల్లేవాల్‌కు చికిత్స చేయించేందుకు పంజాబ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు నేడు (మంగళవారం) సమీక్షిస్తుంది.

సుచిర్‌ది సూసైడ్‌లా కనిపించడం లేదు

మస్క్ స్పందన

వాషింగ్టన్, డిసెంబర్ 30: ఓపెన్ ఏఐ మాజీ ఉద్యోగి, ప్రజా వేగు సుచిర్ బాలాజీ మృతి వివాదం కొత్త మలుపు తీసుకుంది. ఈ కేసులో పోలీసులు తప్పుడు ప్రకటన చేశారని.. కేసును ఎఫ్‌బీఐకి అప్పగించాలని సుచిర్ తల్లి పూర్ణిమారావు ఆదివారం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. 'మేం ప్రైవేట్ డిటెక్టివ్‌ను నియమించాం. రెండోసారి శవ పరీక్ష నిర్వహించాం. నా కొడుకు చావుకి ఆత్మహత్య కారణం కాదని డాక్టర్లు పేర్కొన్నారు. నా కొడుకుది క్రూరమైన హత్య' అని ఆమె తెలిపారు. తన కొడుకు అపార్ట్‌మెంట్‌ను దోచుకున్నారని.. అతడి బాత్‌రూమ్‌లో రక్తపు మరకలు కనిపించాయని ఆమె వెల్లడించారు. తన ట్వీట్‌ను ట్రంప్ ప్రభుత్వంలో భాగస్వాములు కానున్న మస్క్, వివేక్ రామస్వామిలకు ఆమె ట్యాగ్ చేశారు. దీనిపై మస్క్ స్పందిస్తూ సుచిర్‌ది ఆత్మహత్యలా కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.

కాంట్రాక్టర్ ఆత్మహత్యలో కర్ణాటక మంత్రి హస్తం?

బెంగళూరు, డిసెంబర్ 30: కర్ణాటకలో సంచలనం సృష్టించిన సివిల్ కాంట్రాక్టర్ సచిన్ పంచల్ ఆత్మహత్య కేసును సిద్ధరామయ్య సర్కార్ సీఐడీకి అప్పగించింది. ఈ కేసులో రాష్ట్ర మంత్రి ప్రియాంక్ ఖర్గే, ఆయన సన్నిహిత సహాయకుడు రాజు పాత్ర ఉన్నట్టు ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. సచిన్ తన సూసైడ్ నోట్‌లో తన చావుకు రాజు కారణమని పేర్కొన్నారు. రాజు రూ.1 కోటి ఇవ్వాలని తనను డిమాండ్ చేశారని ఆయన తన లేఖలో రాశారు. 'ఈ కేసులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ప్రియాంక్ ఖర్గేపై బీజేపీ ఆరోపణలు చేసింది. ఈ కేసును సీఐడీకి అప్పగించాం' అని హోం మంత్రి పరమేశ్వర సోమవారం మీడియాకు వెల్లడించారు. సచిన్ ఆత్మహత్యతో తనకెలాంటి సంబంధం లేదని.. నిజమేమిటో తెలుసుకోవడానికి విచారణ జరపాలని డిమాండ్ చేశానని ఖర్గే తెలిపారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ డిమాండ్ చేసింది. లేకపోతే కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే ఇంటిని ముట్టడిస్తామని ప్రకటించింది.

దక్షిణ కొరియాలో తప్పిన మరో విమాన ప్రమాదం

సియోల్, డిసెంబర్ 30: దక్షిణ కొరియాకు చెందిన జేజూ ఎయిర్‌లైన్స్‌కు చెందిన మరో విమానం సోమవారం పెను ప్రమాదం నుంచి బయటపడింది. ల్యాండింగ్ గేర్ సమస్య తలెత్తడంతో సోమవారం ఉదయం జేజూ ఎయిర్‌కు చెందిన బోయింగ్ 737-800 విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికి సియోల్‌లోని గింపో అంతర్జాతీయ విమానాశ్రయానికి తిరిగి వచ్చింది. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. జేజూ ఎయిర్‌కు చెందిన మరో విమానం ఆదివారం ఉదయం దక్షిణ కొరియాలోని ముఆన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ సందర్భంగా అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొనడంతో 179 మంది ప్రయాణికులు మరణించారు. ఈ ఘటన జరిగి ఒక రోజు కూడా గడవక ముందే ఇదే ఎయిర్‌లైన్స్‌కు చెందిన మరో బోయింగ్‌కు సాంకేతిక సమస్య తలెత్తి గమ్యస్థానానికి చేరుకోకుండా వెనక్కు తిరిగి రావడం గమనార్హం.

విమానంలో ఏ సీటు సురక్షితం?

న్యూఢిల్లీ: గతవారం కజకిస్థాన్, దక్షిణ కొరియాలో జరిగిన ఘోర విమాన ప్రమాదాలు విమానయాన భద్రతపై సర్వత్రా ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ రెండు విమాన దుర్ఘటన పరిస్థితులు, కారణాలు, ప్రదేశాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన వారి విషయంలో మాత్రం ఒక అంశం పోలి ఉంది. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమానం వెనుకభాగంలో కూర్చున్న ప్రయాణికులను సహాయక సిబ్బంది రక్షించగా దక్షిణ కొరియా విమాన దుర్ఘటనలో కూడా విమానం వెనుక భాగంలో కూర్చున్న ఇద్దరు సిబ్బంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. గతంలో జరిగిన విమాన ప్రమాదాలను విశ్లేషించి చూస్తే విమానం ముందు భాగంలో ఉన్న సీట్ల కన్నా వెనుక భాగంలో ఉన్న సీట్లే సురక్షితమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వెనుక సీట్లే బెటర్?

1971 నుంచి 2005 మధ్య జరిగిన విమాన ప్రమాదాలను అమెరికాక